

గ్రహణ గడియలు

శ్రీవారి ఆలయం 11 గంటల పాటు మూసివేత

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయాన్ని టిటిడి మూసివేసింది. దాదాపు 11గంటల పాటు ఆలయ తలుపులను మూసి ఉంచారు. చంద్రగ్రహణం నేపథ్యంలో లడ్డూ కౌంటర్, అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని కూడా టిటిడి మూసివేసింది. చంద్రగ్రహణం కారణంగా దాదాపు 11 గంటల పాటు ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ ప్రధానఅర్చకులల్లో ఒకరైన శేషాచల దీక్షితులు చెప్పారు. ఇందులో భాగంగా స్వామివారికి సుప్రభాతం, తోమాల, అర్చన, మొదటి నైవేద్యం వంటి సేవాకార్యక్రమాన్ని నిర్వహించి ఉదయం 8.40గంటలకు మహాద్వారం తలుపులను మూసివేశామని తెలిపారు. రాత్రి తిరిగి 7:30గంటలకు ఆలయ తలుపులను తెరిచి శుద్ధి చేసిన అనంతరం భక్తులను అనుమతిస్తామన్నారు.

బోగస్ ఓట్ల కలకలం..!

- ఒకే రోజు 1.29లక్షల ఓట్లు నమోదు
- అంతటా అనుమానాలు
- విచారణకు పిడిఎఫ్ ఎంఎల్‌సీల డిమాండు

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి: **తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గంలో దొంగోట్ల కలకలం రేగింది. ఒకే రోజు 1.29లక్షల ఓట్లు నమోదు కావడంపై అంతటా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ అండదండలతో అధికారులు అడ్డదారులు తొక్కి ఓట్లు నమోదు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై విచారణ చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు డిమాండు చేస్తున్నారు.**

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజక వర్గాలకు సంబంధించి ఓటర్ల నమోదు వ్యవహారం రసాబాసగా మారుతోంది. చరిత్రలో ఎన్నడూ కనివినీ ఎరుగని రీతిలో ఈసారి ఈనియోజకవర్గంలో 3.95లక్షల మంది ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకున్నారు. చివరి రోజు లక్ష మందికి పైగా ఓటర్లు నమోదు కావడం గమనార్హం. అధికార పార్టీ నాయకులు, కొందరు అధికారులతో కలిసి కుమ్మక్కై భారీగా దొంగ పట్టభద్రులను నమోదు చేయించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇక సవరణల సమయంలో మరింత మంది ఇందులో చేర్పించేందుకు వైసిపి కుట్ర చేస్తోందనే ఆరోపణలు కూడా మిన్నంటుతున్నాయి. అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా చూస్తే దాదాపు నాలుగు లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తూర్పు రాయలసీమ ప్రాంత పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజక వర్గానికి సంబంధించి అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతున్న విషయం విధితమే. తొలి 15 రోజులు నిలకడగా సాగుతూ వచ్చింది. అయితే చివరి వారం రోజులు ఈ సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఒకరోజు ముందు 2.66 లక్షల మందికిపైగా పట్టభద్రులు తమ ఓటును నమోదు చేయించుకున్నారు. అయితే చివరి రోజు ఓటరు జాబితా పోటెత్తింది. ఏకంగా 1.25 లక్షల మందిని అధికార పార్టీ దొంగ పద్ధతిలో తమ అనునాయులను పట్టభద్రులుగా తమ ఓటు హక్కును నమోదు చేయించారు.

రికార్డు స్థాయిలో..

తూర్పు రాయలసీమలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది పట్టభద్రులు, 12వేల మంది దాకా ఉపాధ్యాయులు ఉంటారు అనేది అంచనా. అయితే 20వ తేదీ వరకు ఆయా ప్రాంతాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటర్ల నమోదు కార్యక్రమం నత్తనడకన సాగింది. 20రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఊపందుకోలేదు.

ఆయా ప్రాంతాల్లో 20వ తేదీ వరకు ఫాం18ను ఆన్‌లైన్‌లో 55,262 మంది. నేరుగా 9767 మంది నమోదు చేసుకున్నారు. ఇలా మొత్తంగా 67,598 మంది మాత్రం చేసుకున్నారు. ఇక ఉపాధ్యాయుల్లో ఆయా జిల్లాల్లో మొత్తం 1187 మంది నమోదయ్యారు. అయితే వారం రోజుల నుంచి నమోదు ప్రక్రియ పూర్తిగా మారిపోయింది.

ఆరో తేదీ వరకు ఆరు జిల్లాల పరిధిలో పట్టభద్రులు 198695 మంది ఆన్‌లైన్‌లో, 67312 మంది నేరుగా మొత్తం 2,66,007 మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. అయితే సోమవారం ఒక్కరోజుకే 3,95,383 మంది నమోదు చేసుకున్నారు. ఇది ఎలా సాధ్యమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఉపాధ్యాయుల్లో అయితే ఆరో తేదీ వరకు 12,815 మంది నమోదు చేసుకున్నారు. వీరి సంఖ్య ఒక్కరోజుకే 24712కు పెరిగింది. ఏకదాటిగా 11,897కు పెరిగిపోయింది. ఇలా భారీగా నమోదు కావడంపై పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బల్క్‌గా వచ్చిన అప్లికేషన్లపై తనిఖీ చేయాలని వారు డిమాండు చేస్తున్నారు.

శ్రీవారి ఆలయంలో సర్వదర్శనం ప్రారంభం

- ముగిసిన చంద్రగ్రహణం
- రాత్రి నుంచి యథావిధిగా అన్నప్రసాద వితరణ



ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి ఆలయంలో మంగళ వారం రాత్రి 8.20 గంటల నుండి భక్తులకు సర్వదర్శనం ప్రారంభమైంది. మధ్యాహ్నం 2.39 గంటలకు ప్రారంభమైన చంద్రగ్రహణం సాయంత్రం 6.27 గంటలకు ముగిసింది. ఈ కారణంగా ముందుగా నిర్ణయించిన ప్రకారం ఉదయం 8.40 గంటలకు ఆలయం తలుపులు మూశారు. దాదాపు 12గంటల అనంతరం రాత్రి 7.20గంటలకు ఆలయ తలుపులు తెరిచారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం ప్రారంభమైంది.

అన్నప్రసాద వితరణ ప్రారంభం

చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 8.30గంటలకు మూసివేసిన మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్సును రాత్రి 7.30గంటలకు తెరిచారు. వంటశాల శుద్ధి అనంతరం రాత్రి 8.30గంటల నుండి భక్తులకు అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. అన్నప్రసాదం కాంప్లెక్స్ మూసివేత వల్ల భక్తులు ఇబ్బంది పడకుండా ఉదయం 6గంటలకు ఫుడ్ కౌంటర్లలో దాదాపు 10వేల మందికి అల్పాహారం అందించారు. అదేవిధంగా వైభవోత్సవ మండపం, సిఆర్వో వద్ద దాదాపు 30 వేల పులిహోర పొట్లాలు భక్తులకు పంపిణీ చేశారు. టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, పేష్కార్ శ్రీహరి, ఏఈవో పార్థసారధి, విజివో బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 11వరకు ఏపీపీఎస్సీ పరీక్షలు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్‌సర్వీస్ కమీషన్ ఈనెల 9 నుంచి 11వరకు జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలలో మూడు రోజులపాటు అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉద్యోగాలకు పరీక్షల నిర్వహించనున్నట్లు డిఆర్ఓ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లో ఏపీపీఎస్ అధికారులతో, పరీక్షల నిర్వహణ లైజన్ అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి సమావేసమై పలు సూచనలు చేశారు. డిఆర్ఓ మాట్లాడుతూ మూడు రోజులు పాటు నిర్వహించనున్న పరీక్షలకు 890 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు, అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలలో ఎలక్ట్రానిక్ వస్తువుల అనుమతి లేదని తెలిపారు. పరీక్షల నిర్వహణ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలు (3) కేఎంఎం కళాశాల రామిరెడ్డిపల్లి, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్, పుత్తూరు, శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు మల్లికార్జున, హరిబాబు ఆర్టీసీ, విద్యుత్ శాఖల అధికారులు లైజన్ విధులు కేటాయించిన తహాశీల్దార్లు పాల్గొన్నారు.

ఐఐటి, ఐజర్‌లలో పెండింగ్ పనులు

డిసెంబర్ ఆఖరుకు పూర్తి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

కేంద్ర విద్యాసంస్థలు ఐఐటి, ఐజర్‌లలో పెండింగ్ పనులు డిసెంబర్ నెల ఆఖరుకు పూర్తికావాలని జిల్లాకలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో ఐఐటి, ఐజర్ సంస్థలు, జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్, జేసి డికె.బాలాజీ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐఐటి, ఐజర్ విద్యాసంస్థలకు అందించాల్సిన తాగునీటి సరఫరా పైప్‌లైన్, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు గ్రామీణ నీటిపారుదల శాఖ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యాసంస్థల్లో అంతరాయం లేని విద్యత్ సరఫరా ఏర్పాటుకు అంచనాలు రూపొందించి పనులు చేపట్టి డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని సూచించారు. భూములకు సంబంధించి కోర్టు సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని శ్రీకాళహస్తి ఆర్డీఓకి సూచించారు. తుడా సెక్రటరీ తుడా పరిధిలో పెండింగ్‌లో ఉన్న అనుమతులు త్వరగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అగ్నిమాపకశాఖ పరిశీలించి ఎన్‌ఓసి జారీ చేయాలన్నారు. అన్నిశాఖలకు సంబంధించిన పనులకు డిసెంబర్ ఆఖరుకు పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎపిఎస్ ఆర్‌టిసి సంస్థల సూచనల మేరకు రిక్వెస్ట్ స్టాప్, బస్సుసెల్టర్ ఏర్పాటు, కోరిన వేళల్లో బస్సులు నడపడం చూడాలని సూచించారు. ఈసమీక్షలో డిఆర్ఓ శ్రీనివాస రావు, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ రామారావు, ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ, రిజిస్టార్ ప్రసాద్, ఐసర్ ఇఇ జార్జ సజన్, అసిస్టెంట్ రిజిస్టార్ వెంకట దీపక్, ఆర్ అండ్ బి అధికారి సుధాకర్‌రెడ్డి, గ్రామీణ నీటిపారుదలశాఖ అధికారి విజయకుమార్, ఎస్ఈ ఎస్‌పిడిసిఎల్ కష్ణరెడ్డి, తుడ సెక్రటరీ లక్ష్మి, డిపిఒ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతూ తిరుపతి 24వ డివిజన్ ఇందిరానగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇందిరానగర్‌లో మంగళవారం భూమన పర్యటిస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడక ముందు నుంచి తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా, అదేవిధంగా అధికారంలోకి వచ్చిన గడిచిన మూడు సంవత్సరాల కాలంలో ప్రజలను అభివద్ధి పథంలోకి తీసుకువెళ్లే పనిలోనే జగన్మోహన్ రెడ్డి ఉన్నారని ఆయన తెలిపారు. ఇందిరానగర్‌లో పర్యటిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ, ఆసమస్యలను అధికారులకు చెబుతూ, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ హనుమంత్ నాయక్, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహాచారి, తిరుపతి మునిరామిరెడ్డి, ఇందిరానగర్ వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, గంగులమ్మ, నారాయణరెడ్డి, సునీల్ యాదవ్, గౌరీ, రాజు, సాయి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయంలో

అందాల కలువ కొలను ఏర్పాటు



ప్రజాశక్తి-క్యాంపస్: ఇంటర్ ఇన్స్టిట్యూషనల్ కొలాబరేషన్స్ కార్యకలాపాలలో భాగంగా కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం, వృక్షశాస్త్ర ఉద్యానవనం నుంచి సేకరించిన సప్త వర్ణాల కలువ, తామర పుష్పాలతో కూడిన కొలనును శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున మాట్లాడుతూ ఆధ్యాత్మికతకు, స్వచ్ఛతకు చిహ్నమైన ఈఅరుదైన కలువలు పద్మావతి విశ్వవిద్యాలయానికి మరింత శోభను చేకూర్చునున్నాయని అన్నారు. యోగివేమన వక్షశాస్త్ర ఉద్యానవన సమన్వయకర్త డా. మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి పాటుగా, మహిళా విశ్వవిద్యాలయం డీన్స్ ప్రొఫెసర్ అనురాధ, నాగరాజు, ప్రొఫెసర్ సుజాత, ప్రొఫెసర్ సుధా ప్రొఫెసర్ సావిత్రి డాక్టర్ గంగాభవాని, డిపార్ట్మెంట్ ఆఫ్ బయో సైన్స్ అండ్ సెరికల్చర్ అధ్యాపకులు డాక్టర్ విజయకుమారి, శాంతిశ్రీ, సువర్ణలత, హేమావతి, రేఖ, శోభారాణి, హరిప్రియ, శ్వేత ప్రియ, పిఆర్ఓ శ్రీరజిని పాల్గొన్నారు.

మత్తు వ్యసనాలకు దూరం చేయడం ఆనందదాయకం

ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: మత్తులో నుంచి బయటపడి ఇన్ని కుటుంబాలు బాగుపడ్డాయంటే నిజంగా చాలా ఆనందంగా ఉందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెనడీ నగర్‌లోని మత్తు పదార్థాల నిర్మూలన కేంద్రం, డిఅడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించి ఒక్క సంవత్సరం పూరైన సందర్భంగా ఆ కేంద్రంలో మత్తు నుంచి బయటపడ్డ వ్యక్తులతో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడి వారి ప్రాణాలతో పాటు తమ కుటుంబాలను కూడా హరిస్తున్నటువంటి వ్యక్తులను కొంతమేరకైనా బాగుపరచాలనే లక్ష్యంతో డి అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఈ సెంటర్ ద్వారా కౌన్సిలింగ్ పొంది, చికిత్సలు తీసుకొని పూర్తిగా మత్తు వ్యసనాల నుంచి దూరమై, తాను బాగుపడడమే కాకుండా తమ కుటుంబాలను నిలబెట్టుకుంటున్న వారందరికీ తన ప్రత్యేక అభినందనలని అన్నారు. ఈ సెంటర్ ద్వారా మత్తు నుంచి బయటపడిన వ్యక్తుల మాటలు వింటుంటే చాలాకాలం తర్వాత ఒక గొప్ప అనుభూతి కలుగుతున్నదన్నారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఏ మున్సిపలిటిలో లేనటువంటి గొప్ప ఆలోచనతో రూపొందించిన డి అడిక్షన్ సెంటర్ ద్వారా అనేక కుటుంబాలు బాగుపడ్డాయన్నారు. ఇంకా కూడా కార్పొరేషన్ తరపున మరింత చొరవతో ఎన్ని వందల మందికైనా ఈ మత్తు నుంచి బయటపడేందుకు తమ తోడ్పాటు అందిస్తామన్నారు. నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ హరికష్ణ మాట్లాడుతూ డి అడిక్షన్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 215మందికి కౌన్సిలింగ్‌తో చికిత్సలు అందించడం జరిగిందని, టెలిపోన్ ద్వారా 131మందికి సలహాలు, సూచనలు చేయడం జరిగిందన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ ఎస్కే బాబు మాట్లాడుతూ తిరుపతి నగరంలో మత్తుకు బానిసలై తమ తల్లిదండ్రులను, కుటుంబాలను ఇబ్బందులు పెడుపడుతున్న యువతను చూసి చలించిన ఎమ్మెల్యే భూమన మెదడులో పుట్టిన ఆలోచన ఫలితమే ఈ డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటు జరిగిందన్నారు. కార్పొరేటర్ కోటూరి ఆంజనేయులు, డి అడిక్షన్ సెంటర్ డాక్టర్ ఆశా, సెంటర్ కౌన్సిలర్స్ షకీలా, పవన్, సిస్టర్ కవిత, శానిటరి సూపర్‌వైజర్ సుమతీ, నాయకులు తాళ్ళూరి ప్రసాద్, శ్యామల, బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ప్రేమజంట ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ప్రేమజంట

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఓ ప్రేమజంట ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం తిరుపతి నగరంలోని ఓ లాడ్జిలో జరిగింది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు... తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన కష్ణారావు(21) తూర్పు గోదావరి కొవ్వూరుకు చెందిన వెంకటేశ్వరరావు కుమార్తె అనూష (20) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరు వేర్వేరు కులాలు కావడంతో పెద్దలు వీరి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో అనూష తల్లిదండ్రులు రెండేళ్ల క్రితం ఆమెకి వివాహం చేశారు. ఈనెల మూడో తేదీన అనూష ఇంటి నుంచి వచ్చేసింది. దీంతో వారి తల్లిదండ్రులు అక్కడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన ప్రేమజంట గోవిందరాజులస్వామి ఆలయ ఉత్తరమాడ వీధిలోని త్రిలోక్ రెసిడెన్సీలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. ఉదయం రూమ్ బాయ్‌తో టిఫిన్ తెచ్చుకొని తిని మధ్యాహ్నం బయటికి వెళ్లారు. రాత్రి యథావిధిగా భోజనం చేసి పడుకున్నారు. ఉదయం ఏడు గంటలకు గదిని ఖాళీ చేయించాలని లాడ్జి మేనేజర్ సూచించడంతో రూమ్ బాయ్ వెళ్లి తలుపుతట్టగా తలుపు తెరవలేదు. వెంటనే మేనేజర్ కు తెలియజేయడంతో కిటికీల పైనుంచి చూడగా ఇద్దరూ ఉరేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈస్ట్ పోలీసులు తెలిపారు.

నిరంతర పరిశోధకుడు.. ఆచార్య మురళీధర్

33 సంవత్సరాలుగా అధ్యాపకుడిగా సేవలు
క్రీడలు, సంగీతంలోనూ విశేష ప్రతిభ





ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో విద్యార్థిగా పరిశోధకుడిగా అధ్యాపకుడిగా వివిధ విభిన్న కోణాల్లో విశిష్టంగా రాణించిన వ్యక్తి ఆచార్య బివి మురళీధర్. నవంబర్ 9వ తేదీకి ఆయన ఆచార్యులుగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చేరి దాదాపుగా 33 సంవత్సరాలు పూర్తికానున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మనోభావాలను పంచుకున్నారు. నిరంతర పరిశోధకుడిగా, రాజకీయ అంశాల పట్ల విశ్లేషకుడిగా, విద్యార్థులకు సివిల్స్ కోచింగ్‌లో రాజనీతి శాస్త్రాన్ని మంచిగా బోధించే నిష్ణాతుడిగా, టెన్నిస్ రంగంలో జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి క్రీడాకారుడిగా, సంగీతంలో కూడా ప్రావీణ్యం కలిగిన వ్యక్తిగా పలు విభిన్న కోణాలలో ఆయన రాణించారు. ప్రొఫెసర్ బివి.మురళీధర్ 1964లో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నంద్యాలలో బిఎం. వెంకటేశులు, కేఎన్ఎ సరోజినీ దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు. బాల్యం నుంచి డిగ్రీ వరకు ఆంగ్లవిద్యను అభ్యసించారు. 1985లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని రాజనీతి శాస్త్రంలో మాస్టర్ డిగ్రీని మూడవ ర్యాంక్ మరియు బంగారు పతకంతో పూర్తి చేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని రాజనీతి శాస్త్రంలో అతని పరిశోధన అంశం అంతర్జాతీయ సంబంధాలు, విదేశీ విధానంకు చెందిన అంశాలపై 1987లో మాస్టర్ అఫ్ ఫిలాసఫీ, 1995లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీలను పూర్తి చేశారు. 24 సంవత్సరాలకే రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1989లో నియమితులయ్యారు. ఆ తర్వాత 1998లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2007నుంచి ప్రొఫెసర్‌గా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. మురళీధర్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో ఆధునిక రాజకీయ విశ్లేషణ, అంతర్జాతీయ సంబంధాలు, భారతీయ విదేశాంగ విధానం, భారతదేశంలో సామాజిక ఉద్యమాలు, పరిశోధనా పద్ధతులు, మానవ విలువలు మరియు వత్తినైతికత బోధిస్తున్నారు. భారతదేశం మరియు విదేశాలలోని వివిధ సంఘాలు, విద్యాసంస్థలలో సభ్యులుగా వ్యవహరిస్తున్నాడు. యుజిసి ప్రత్యేక ఉపన్యాసాలు, 111 అకడమిక్ స్టాఫ్ కాలేజీ ఉపన్యాసాలు అందించారు. తన 33ఏళ్ల అపారమైన బోధనా, పరిశోధనా అనుభవం ఆధారంగా రాజనీతి శాస్త్రంలో వివిధ విద్యా విషయాలపై పదకొండు ఎడిటెడ్ పుస్తకాలను, జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్, పుస్తకాలలో మొత్తం నలభై ఎనిమిది పరిశోధనా వ్యాసాలను రాశారు. అకడమిక్ అసైన్మెంట్లపై దక్షిణ కొరియా, మలేషియా, నెదర్లాండ్స్, బెల్జియం, జర్మనీ, స్వీడన్, నార్వే, డెన్మార్క్, బ్రిటన్, హాంకాంగ్, థాయిలాండ్, నేపాల్, అమెరికా, వియత్నాం, చెక్ రిపబ్లిక్లను సందర్శించారు. ఇప్పటివరకు అతను 27మంది రీసెర్చ్ స్కాలర్లకు మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ, పోస్ట్-డాక్టోరల్ ఫెలో డిగ్రీ కోసం విజయవంతంగా మార్గనిర్దేశం చేశారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలోని రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రవిభాగానికి చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్‌గా, 2008 నుండి విద్యార్థి సంక్షేమం మరియు సాంస్కతిక వ్యవహారాల విభాగానికి డైరెక్టర్‌గా, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు 2020 -2022 వరకు ప్రిన్సిపాల్‌గా కూడా బాధ్యతలను నిర్వహించడం ద్వారా అపార పరిపాలనా అనుభవం గడించారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని డిపార్ట్మెంట్ ఆఫ్ స్టేట్స్ అతనిని యు మాస్ అమ్ హెర్ట్‌లో 'అమెరికన్ పాలిటిక్స్ అండ్ థాట్' అనే అంశంపై కోర్సు చేయడానికి 2007లో అమెరికన్ ఫుల్బ్రైట్ ప్రోగ్రామ్ అతనిని ఎంపిక చేసింది. అతను జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలలో 14 టెక్నికల్ సెషన్లకు అధ్యక్షత వహించాడు. ఇప్పటివరకు అతను 2 అంతర్జాతీయ సదస్సులు మరియు 02 జాతీయ సెమినార్లు నిర్వహించారు. ఇది కాకుండా కోవిడ్ సమయంలో ప్రొఫెసర్ బివి. మురళీధర్ సోషియాలజీ విభాగంతో కలిసి 15 అంతర్జాతీయ వెబ్నార్లు 1 జాతీయ వెబ్నార్లను నిర్వహించారు. ప్రస్తుతం అతను డీన్, ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, రాజనీతి శాస్త్రం మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగానికి చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్‌గా అలాగే విద్యార్థి సంక్షేమం మరియు సాంస్కతిక వ్యవహారాల విభాగానికి డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నాడు. అకడమిక్ ప్రొఫైల్‌తో పాటు, అతను మంచి టెన్నిస్ ఆటగాడుగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. జాతీయ, రాష్ట్ర మరియు స్థానిక స్థాయిలలో 125 కంటే ఎక్కువ టోర్నీలు ఆడటం జరిగిందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ఆయన విస్తతంగా పాల్గొని అనేకమంది నిరుపేదలకు ఎంతో సేవలు అందించారు. బోధనా, పరిశోధనా రంగాలలో విశేష అపారమైన అనుభవం కలిగిన వ్యక్తిగా కాకుండా టెన్నిస్ క్రీడ రంగంలో కూడా ఆయన తన ప్రతిభతో రాణిస్తూ ఉండడం పలువురి పరిశోధకులకు, ఇతర విద్యార్థిని, విద్యార్థులకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాడని చెప్పవచ్చు.



'స్కేటింగ్'లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: సౌత్ ఇండియా మినీ రోల్ బాల్ ఛాంపియన్ షాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలుర స్కేటింగ్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులను డాక్టర్ ఎంజీఎం శ్రీనివాసులు ప్రిన్సిపాల్ శరవణ కలసి రవికిరణ్‌ను అభినందించారు. చదువుతోపాటు క్రీడలు కూడా చాలా అవసరమని తెలిపారు. విద్యార్థులు మూడవ తరగతి చదువుతున్న ఎం. చరీష్ రాయల్, ఐదవ తరగతి చదువుతున్న కే భారతి రాజాలకు మెడల్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను జోనల్ పీటీ సతీష్ జోనల్ ప్రైమరీ ఇన్‌చార్జ్ సి.లావణ్య, ఏ.జ్యోతి అభినందించారు.

ప్రతి ఇంటికీ వస్తా :ఎమ్మెల్యే



ప్రజాశక్తి- కేవీబీపురం: మండలంలోని రంగయ్యగుంట సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సీఎం జగన్ మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదని ఆరా తీశారు. ప్రజల నుండి వస్తున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపిపీ మునిలక్ష్మి, నందకుమార్, రాష్ట్ర హిస్టరీ అకాడమిక్ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్యకి, జెడ్పిటిసి మూర్తి, మునెమ్మ, సుబ్బయ్య, వైస్ ఎంపీపీ, డేరాల శ్రీనివాసులు, సరస్వతి, రమేష్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనంజెయల రెడ్డి, తహశీల్దార్ ద్వారకనాథరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, ఎంఈఓ లక్ష్మీపతి, ఏఎస్ఐ లోకనాథం, వారి బృందం వైసీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తిరువన్నామలైకు ఆర్టీసీ బస్సులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తి ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ నుండి తిరువన్నామలైకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజవర్ధన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ, 21వ తేదీన ఈ ప్రత్యేకమైన బస్సులు నడుపుతున్నామని తెలిపారు. 14, 21వ తేదీల్లో ఉదయం 5 గంటలకు బస్సు బయల్దేరి మధ్యాహ్నం 1గంటకు తిరువన్నామలై చేరుకుం టుందనీ, అదే రోజు రాత్రి 10:30కు తిరువన్నామలై నుండి బయలుదేరి శ్రీకాళహస్తికి ఉదయం 5.00 గంటలకు చేరు కుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కలదనీ, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 7382880178, 7382876542, 7382881715 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -బీఎన్‌కండ్రిగ: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చట్టాలపై అవగాహన కలిగిఉంటే సమస్యలకు దూరంగా ఉంటారని ఎంపిపీ మేకల సుబ్బలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ వెంకటమ్మ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలను నిర్మూలించాలని.. న్యాయ సలహాలకు 15100 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, న్యాయవాదులు మల్లికార్జునయ్య, అరుణ్, పారాలీగల్ వాలంటర్లు వాలంటర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరుకు జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి



ప్రజాశక్తి -పిచ్చాటూరు: జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం ఉదయం తహశీల్దారు మధుసూదన్‌రావు, హౌసింగ్ ఏఈ ముత్తుకుమార్, ఏపీఎం వనితతో కలిసి ఆయన స్థానిక జగనన్న కాలనీలో పర్యటించారు. లబ్ధిదారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు అన్నీ వెంటనే పూర్తి చేసి డిసెంబర్ 21న ప్రభుత్వం నిర్వహించే సామూహిక గహ ప్రవేశం రోజు ప్రారంభానికి సిద్ధంగా ఉండాలన్నారు. వెలుగు నుంచి రుణాలు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పంచాయితీ కార్యదర్శి రాధిక, వీఆర్వో ప్రియాంక, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళపై వైసీపీ నాయకుడి దౌర్జన్యం దారుణం

సీఐటీయూ కార్యదర్శి శివకవి ముకుంద

ప్రజాశక్తి -నాయుడుపేట: రోడ్డు పక్కన మున్సిపాలిటీ స్థలంలో చిన్న పాక వేసుకుని జీవనం సాగిస్తున్న పేద మహిళపై అధికార పార్టీ నాయకుడు వెంటనే అక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ తన అనుచరులతో వచ్చి దౌర్జన్యానికి పాల్పడటం దారుణమని సీఐటీయూ కార్యదర్శి శివకవి ముకుంద అన్నారు. చంద్రకళ అనే మహిళ గత కొంత కాలంగా అక్కడ జీవనం సాగిస్తోందని..అతనికి చెందిన మండపానికి వచ్చే వారి కార్ల పార్కింగ్ కోసం ఆమెను ఖాళీ చేయాలని దౌర్జన్యం చేయడం ఏంటని ప్రశ్నించారు. దౌర్జన్యాలు చేసినా.. ఆమెను ఖాళీ చేయించినా చూస్తూ ఊరుకోమని తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ఈకేవైసీలో జిల్లాలో మొదటి స్థానం

ప్రజాశక్తి - దొరవారిసత్రం: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆయుష్మాన్ భారత్ కార్డులకు ఈకేవైసీ చేయడంలో జిల్లాలో మొదటి స్థానం దొరవారి సత్రం మండలం నిలిచిందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలాన్ని మొదటి స్థానంలో ఉంచడానికి కషి చేసిన వాలంటీర్లు, ఏఎన్ఎంలు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులకు అభినందనలు తెలిపారు. ఆయుష్మాన్ కార్డు పొందిన ప్రతిఒక్కరికీ రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా గుర్తించబడిన అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో వైద్యం పొందవచ్చని తెలిపారు.

సచివాలయ సిబ్బంది తీరు మార్చుకోవాలి



ప్రజాశక్తి -బాలాయపల్లి: సచివాలయం సిబ్బంది తీరు మార్చుకోవాలని తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జయంపు, కామకూరు గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్న సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. ఇక వివిధ సమసలపై వచ్చిన వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలన్నారు. ఇక బయోమెట్రిక్ విధానంతో పాటు జాబ్ చార్టు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే చార్టులు ప్రదర్శనపై మండిపడ్డారు. నిర్లక్ష్యంగా నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఇక సంక్షేమ పథకాల అమలుతో పాటు లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ విధులపై అంకితభావం అవసరమని సూచించారు. సచివాలయం పరిధిలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదు వాటి వివరాలు గురించి సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

సుజాతమ్మకు మాజీ ఎమ్మెల్యే చేయూత



ప్రజాశక్తి -గూడూరు రూరల్: గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని వాకాటి సుజాతమ్మకు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతత్వంతో ఆర్థిక సాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాసిం సునీల్ కుమార్ చెన్నూరు దళితవాడలో పర్యటించినపుడు వాకాటి సుజాతమ్మ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ని కలిసి తాను గుండె జబ్బుతో బాధపడుతున్నానని, ఏ పనికి పోలేకపోతున్నానని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని వాపోయారు. ఆయన ఆర్థిక సహాయం చేస్తామని భవిష్యత్తులో మీ కుటుంబానికి అన్నగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దీంతో మంగళవారం గూడూరు నియోజకవర్గ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు కల్లూరు రవి, నియోజకవర్గ యువత చెన్నూరు కష్ణమూర్తి, నాయకులు జయరామయ్య చేతుల మీదుగా మాజీ ఎమ్మెల్యే అందించిన సాయాన్ని సుజాతమ్మ కుటుంబానికి అందించారు. సుజాతమ్మతోపాటు కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కి కతజ్ఞతలు తెలిపారు. ప్రతినెలా రూ.2 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళితవాడ యువకులు మణి, ధనశేఖర్, ఏడుకొండలు, పవన్, దళిత వాడ ప్రజలు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ఉపాధి బహిరంగ సభ



ఉపాధి హామీ బహిరంగ సభలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉపాధి హామీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు గాను రూ.10,42,61,532 లకు పనులు జరిగాయన్నారు. ఇందులో రూ.6,16,99,212 కూలీలకు అందజేసినట్లు తెలిపారు. ఉపాధిలో జరిగిన అవినీతికి పలువురి టీఏలకు రూ.64,751, రూ.77,793 రికవరీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఈవోపీఆర్డీ సురేంద్రనాథ్, డీఆర్పీలు ఎస్ఆర్పీలు, ఏపీవో కష్ణయ్య పాల్గొన్నారు.

కరెంటు ఛార్జీలతో వైసీపీ బాదుడు



- కార్యక్రమంలో భానుప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ : కరెంటు ఛార్జీలు భారీగా పెంచి ప్రజలను వైసీపీ ప్రభుత్వం బాదేస్తుందని.. ఈ ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ విమర్శించారు. మంగళవారం నింద్ర మండలం ఐఆర్ కండ్రిగ, ఎం.ఎస్.వి.ఎం పురం పంచాయతీలలో 'మీ కోసం-మీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగుదేశం హయాంలో రూ.300 ఉండే కరెంటు బిల్లు నేడు రూ.వెయ్యికి పైగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసుదేవ తదితరులు పాల్గొన్నారు.



సహకార బ్యాంకులో విలువైన సేవలు

ప్రజాశక్తి -బాలాయపల్లి: సహకార బ్యాంకులో విలువైన సేవలు అందించ నున్నట్లు గూడూరు బ్రాంచ్ మేనేజర్ వెంకట్ తెలిపారు. మంగళవారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార బ్యాంకులో డిపాజిట్లు, స్వల్పకాలిక రుణాలు, వాహన రునాలు, పంటరుణాలు అందిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకం, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాపై పలు సూచనలిచ్చారు. సహకార ఉన్నతి, సహకార అమత్‌పై వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురళీ మోహన్‌రెడ్డి, జయం సహకార సంఘం డైరెక్టర్ సుబ్బారావు, సూపర్‌వైజర్ గురునాథం, సుధీర్, జయంపు సీఈవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీలో నూతన విద్యకు శిక్షణ

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: పుత్తూరు డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.



- విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

ఈనెల 21వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరు ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తి వికాసంపై సదస్సు జరిగింది. ప్రముఖ వ్యక్తి వికాస నిపుణులు డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి గుణాలు .. మంచి నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసింహులు, దేవకిరెడ్డి నాయక్, వాసవి, తిరుమలయ్య, గంగయ్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు



ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న కాలనీ పనులను సోమవారం సర్పంచ్ విరిత దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకం జగనన్న గృహ నిర్మాణం పనులను సరదాగా నిర్మాణం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని వెంటనే గృహ నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపురం పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థినులు ఇండస్ట్రియల్ విజిట్

ప్రజాశక్తి- క్యాంపస్: శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ ఎంబీఏ విద్యార్థినులు విభాగాధిపతి ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌ను సందర్శించడం జరిగింది. విద్యార్థులకు ముందుగా లైబ్రరీ విభాగం లో ఉన్నటువంటి ఆడిటోరియంలో, ఎస్‌హెచ్‌ఏఆర్ గురించి ఒక వీడియో చూపించడం జరిగింది. ఎస్‌హెచ్‌ఏఆర్ ఎప్పుడు స్థాపించబడింది అంచలంచలుగా ఎలా అభివద్ధి చెందింది అనేటువంటి విషయాలు తెలిపారు. తరువాత మిషన్ కంట్రోల్ సెంటర్, లాంచ్ ప్యాడ్లు, మ్యూజియంను సందర్శించడం జరిగింది. విద్యార్థినులకు మిస్టర్ అనిల్ కుమార్, పిఆర్ఓ డిపార్ట్మెంట్ వాటన్నిటి గురించి కూలంకషంగా వివరించారు. ఈసందర్శన వలన విద్యార్థినులకు ఒక సంస్థ పనితీరు, దానిలో ఉన్నటువంటి కష్టనష్టాలు, అందరూ కలిసికట్టుగా పనిచేయటం వంటి విషయములను తెలుసుకున్నారు. అలాగే రాకెట్‌లాంచ్ చేసేటప్పుడు వివిధ విభాగాల సమన్వయం, వారు ఫేస్ చేసే స్ట్రెస్ గురించి తెలిపారు. ఫ్యాకల్టీ డాక్టర్ ఎన్.శ్రీరజనీ, డాక్టర్ వి.భార్గవి, డాక్టర్ జి.సుభాషిణి, డాక్టర్ వై.సునీత విద్యార్థినులతో కలిసి ఎస్‌హెచ్‌ఏఆర్ విసిట్‌కు వెళ్లారు.



రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వడమాలపేట మండలం పరిధిలోని పూడి రైల్వేగేట్ మరమ్మతుల కారణంగా సోమవారం రాత్రి ఏడు గంటల నుంచి మూడు రోజులపాటు తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి పూడి మార్గంలో వెళ్లే ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని రైల్వే వారు కోరారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండలంలోని మావిళ్ళపాడు గ్రామ సమీపంలోని మోడల్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కుష్ఠ వ్యాధి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ప్రైమరీ మెడికల్ ఆఫీసర్ మోహన్‌రావు, వైద్య పర్యవేక్షకులు సగుటూరు జనార్ధనయ్య, ప్రిన్సిపల్ సుమలత, హెల్త్ సూపర్‌వైజర్ జనార్ధన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కరపత్రాలు పంపిణీ



ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంటలో తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వీఆర్ రావణన్ ఆధ్వర్యంలో మంగళవారం జోడో యాత్రకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీ మాట్లాడుతూ అభివద్ధి ఆగిపోయిందని.. నిరుపేదలకు వచ్చిన రెండు బెడ్ రూమ్‌ల ఇళ్లు, మన్నవరం బెల్ ఫ్యాక్టరీ, ఓడరేవు, విద్యార్థుల ఉపకార వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం ఆపడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సురేష్, తులసి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

ఘనంగా కార్తీకమాస వనభోజనం

ప్రజాశక్తి -పెళ్లకూరు: మండలంలోని గౌరీశంకర్ తోటలో మంగళవారం కార్తీక మాసం సందర్భంగా పెళ్లకూరు మండల రెవెన్యూ అధికారి జయజయరావు, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమం అనంతరం 12 గంటల నుంచి వనభోజనం జరిగింది. కార్యక్రమానికి మండల పోలీస్ అధికారి మనోజ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు



ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: పరమేశ్వర మంగళం పంచాయతీలోని జయరాణిపురం కూర్మానుకండ్రిగ గ్రామాలలో విద్యుత్తు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, సింగిల్ విండో ఛైర్మన్ జయపాల్ , నాయకులు హేమాద్రి, ఏలుమలై, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నందిని, పంచాయతీ కార్యదర్శి, ఏఈలు కలిసి చర్చిస్తున్నారు. గ్రామాల్లో వ్యవ సాయ మోటార్లకు.. విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

పంట కాలువను కాపాడాలి



ప్రజాశక్తి -గూడూరు: మండలంలోని పొటుపాలెం, చిల్లకూరు మండలంలోని నాంచారమ్మ పేట, పెంటపాడు గ్రామాల రైతులు పంటలకు నీరు అందించే చెరువుకు వెళ్లే నీరు పారే ఒరువ కాలువను తవ్వి పూడ్చివేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఒరవ కాలువ పూడటంతో 450 ఎకరాల రైతుల వ్యవసాయ భూమిని బీడు పెటాల్సి ఉంటుందన్నారు. రైతుల కన్నీటి గాథలు చూసి ప్రభుత్వ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



ప్రజాశక్తి -వాకాడు: మండలంలోని వాకాడు కైకాలపాలెం గ్రామానికి చెందిన దాసరి ఉమామహేష్(50) సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు స్వర్ణముఖి నదిలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై రఘునాథ్ మంగళవారం గాలింపు చర్యలు చేపట్టారు. మతదేహం లభ్యం కాకపోవడంతో మంగళవారం తెల్లవారుజామున అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టి మతదేహాన్ని బయటకు తీశారు. దాసరి ఉమామహేష్ టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఓ భార్య కూతురు ఉన్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- రూ.3 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం



ప్రజాశక్తి -తొట్టంబేడు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇళ్లల్లోకి చొరబడి చోరీ చేసి నగలు, నగదు ను దోచుకునే నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. వివరాలిలా.. చీరాలకు చెందిన దాసరి ముఖేష్ ఈ ఏడాది మార్చి నెలలో బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. జూలై నెలలో తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామంలోని ఓ ఇంట్లోనూ చోరీ చేసి నగలు దోచుకెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ రాఘవేంద్ర నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మంగళవారం నిందితున్ని తంగేళ్లపాలెం క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడి నుంచి రూ.3 లక్షలు విలువ చేసే 62 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన అరుణ్ , గంగాకుమార్‌లను అభినందించారు.

పని భారం తగ్గించండి



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: తమపై పని భారం తగ్గించాలని శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు ఆర్డీవో రామరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను లబ్ధిదారులకు చేరవేసేందుకు వీఆర్వోలు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. గత రెండేళ్లుగా జగనన్న కాలనీల నిర్మాణానికి అవసరమైన భూమి, పరిహారం, సర్వేలు, లే-అవుట్లు, ఇంటి పట్టాలు తదితర పనుల్లో సమయంతో పని లేకుండా పగలు రాత్రి తేడా లేకుండా నిమగ్నం అవ్వాల్సి వస్తు వస్తుందని వాపోయారు. ఇప్పుడు తాజాగాశాశ్వత భూమి హక్కు, భూముల రీ సర్వే పేరిట తమపై మరింత ఒత్తిడి పడుతోందని, భూముల రి సర్వేకు హాజరవుతున్న సిబ్బందికి సంబంధిత వీఆర్వో లే ఖర్చులు భరించాలని చెప్పడం బాధాకరమన్నారు. ఫలితంగా తాము మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనీ, కొందరు అనారోగ్యంపాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విఆర్వోలకు నిబంధనల మేరకే అని సమయం కేటాయించాలని కోరారు. వీఆర్వోలు రాఘవరెడ్డి, హేమంత్ కుమార్, పూర్ణిమ, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రజాశక్తి -తిరుపతి: మంగళం పరిధిలోని మంగళం గ్రామ లెక్క దాఖల సర్వేనెంబర్ 118లో గల కాలువ పోరంబోకు స్థలంలో తిరుపతి అర్బన్ తహశీల్గార్ వెంకటరమణ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని వీఆర్వోలు భూపతి, సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ గతంలో సర్వేనెంబర్ 118లోని కాలువ పోరంబోకు స్థలంలో నిర్మాణాలు చేయడానికి ప్రయత్నించడంతో అడ్డుకున్నామన్నారు. అయితే ఇటీవల మళ్ళీ నిర్మాణాలు చేపడు తుండడంతో తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాలతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ఇకపై ఏ విధమైన అక్రమ నిర్మాణాలు ఈ కాలువ పోరంబోకు స్థలంలో చేపట్టినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆహార, నీటి నాణ్యతపై రెండు రోజుల వర్క్‌షాప్

ప్రజాశక్తి -రేణిగుంట: శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ సైన్స్ ఆధ్వర్యంలో రేణిగుంట మండల పరిధిలోని కుర్రకాలువ వద్ద ఉన్న డెక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ పూణే వారి ఫెర్గ్యూసన్ ఉన్నత విద్య అధ్యయన కేంద్రం సంయుక్తంగా ఆహారం నీటి నాణ్యతపై రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు డెక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ సచిన్ ఖేద్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 10, 11 తేదీల్లో డిగ్రీ, పీజీ కళాశాల ఫ్యాకల్టీ కోసం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, సామాజిక ఆర్థిక శ్రేయస్సుకు నీటి నాణ్యత చాలా ముఖ్యమైందన్నారు. ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయితీ పరికరాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: వేరుశనగ రైతులకు రాయితీపై స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి తెలిపారు. అవసరమైన రైతులు ఫీల్డ్ బౌండ్రీ స్కెచ్, 1బి, పట్టాదారు పాస్ బుక్, బ్యాంకు పాస్ బుక్, రెండు ఫోటోలతో స్థానిక ఆర్బీకేల్లో కంపెనీ సబ్సిడీ పరికరాలకోసం డిస్ట్రిక్ట్ మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్, తిరుపతి వారికి అన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదెకరాల కంటే తక్కువగా భూమి వున్న రైతులకు యభైఐదు శాతం, అంతకంటే ఎక్కువ వున్న రైతులు నలభై ఐదు శాతం రాయితీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.